క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన వృద్ధుల ఆనంద ఆశ్రమంలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లకుపైబడిన వృద్ధులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్‌నారాయణ, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, ఆశ్రమ మేనేజింగ్ ట్రస్టీ ఈటల సమ్మయ్య, వైద్యులు కిషన్‌రావు, తాహెర్ మసూద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అభినందన



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దళిత జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గబ్బెట బాబు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కడియం కావ్య వరంగల్ ఎంపీగా గెలిచిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చెన్నారావుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు (శుక్రవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని కొమ్మాలకు చెందిన కౌలు రైతు గడ్డమీది అశోక్ అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి గురువారం రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన పంపిన డబ్బును నాయకులు మల్రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించారు. అలాగే ఎలుకుర్తిలో రెండు బాధిత కుటుంబాలకు కిశోర్‌రెడ్డి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, గడ్డమీది రమేశ్, వీరాటి రవీందర్‌రెడ్డి, బొడిగె శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

బియ్యం, నూనె..

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జిట్ట రామచంద్రు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం చేయూత అందజేశారు. బాధిత కుటుంబానికి శ్రీనివాస్‌రెడ్డి 75 కేజీల బియ్యం, 15 కేజీల వంటనూనె సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, అమ్మిరెడ్డి, గబ్బెట బాబు, వెంకటయ్య, గూడెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ గెలుపు నేపథ్యంలో నియోజకవర్గ ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఎన్నికల కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేవారు. నియోజకవర్గంలోని పట్టణంలో, ఆరు మండలాల్లో కలిపి 283 బూత్‌ల్లో రికార్డు స్థాయిలో అత్యధికంగా 55 వేల 111 ఓట్ల మెజార్టీ వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు, నిరంతరం శ్రమించిన శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు : మండలంలోని ఐనవోలు, వెంకటాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్లకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. ఒంటిమామిడిపల్లి ఫీడర్ పరిధిలోని ఒంటిమామిడిపల్లి, నాగపురం గ్రామాల్లోని ఇళ్లు, వ్యవసాయ బావులు, పౌల్ట్రీ ఫాంలకు, అదే విధంగా వెంకటాపూర్ గ్రామ ఇళ్లు, వ్యవసాయ బావులకు నేటి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతులు, గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.



వర్ధన్నపేట : ర్యాలీ తీస్తున్న వైస్ ఎంపీపీ, టీచర్లు



పర్వతగిరి : అంబేడ్కర్ సెంటర్‌లో..



దుగ్గొండిలో..

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

రాయపర్తి (వర్ధన్నపేట): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి సోమయ్య తెలిపారు. మండలంలోని దమ్మన్నపేటలో గురువారం నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని చెప్పారు. విశాలమైన క్రీడా మైదానం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి మహేశ్‌నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ హైమ, సీఏ మండల పద్మ, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, కవి, సరళ, సరస్వతి, రమేశ్ పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి మాట్లాడారు. తల్లితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. మధ్యాహ్న భోజనం, యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాక రమేశ్‌బాబు, నాజియా సల్మా, కుబ్రా, ఏఏపీసీ చైర్మన్ బొట్ల గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నెక్కొండలో..

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించిన బడిబాట ర్యాలీని హెచ్ఎం రామస్వామి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విద్యాబోధన అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, సంధ్య, కరుణ, అహ్మద్, మహేశ్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురంలో..

నెక్కొండ : మండలంలోని సూరిపల్లిలో నిర్వహించిన ర్యాలీలో హైస్కూల్ హెచ్ఎం బత్తుల పరమేశ్వర్ మాట్లాడారు. బడి ఈడు పిల్లలను స్కూలులో చేర్పించేలా సమాజంలోని ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాదాటి శారద, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బోజ్యా నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు రజియా, శశిరేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలో బడిబాట ర్యాలీ నిర్వహించగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల పని తీరు, విద్యాబోధనలో చేపడుతున్న నూతన ఒరవడి, తదితరాలను వివరించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి



పర్వతగిరి : పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సంజీవరెడ్డి

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో అత్యుత్తమ విద్యాబోధన లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఎంపీడీఓ మాలోతు శంకర్, మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. పాఠశాలలు ప్రారంభించే నాటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం కృష్ణమూర్తి, పర్వతగిరి, కొంకపాక కాంప్లెక్స్ హెచ్ఎంలు పాక రమేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో చినుకు పడితే చిత్తడే అన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. వర్షాలు ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలోనూ సమస్య తీవ్రత చోటు చేసుకుంటోంది. గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికే అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో ఇళ్లు జలమయమయ్యాయి. అధికారులు స్పందించి ఇళ్లలోకి వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టి తమను రోగాల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరతున్నారు.

అవార్డు నేపథ్యంలో అభినందనల వెల్లువ



గీసుకొండ : జాతీయ ఉత్తమ పంచాయతీగా మండలంలోని మరిపురం గ్రామం రాష్ట్రస్థాయి పర్యావరణ పరిరక్షణ అవార్డు అందుకున్న నేపథ్యంలో అందుకు కారకులైన మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లెల స్వప్న హైదరాబాద్‌లో బుధవారం అవార్డు అందుకోగా గురువారం మాజీ సర్పంచ్ బాలిరెడ్డితో కలిసి అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు అల్లం బాలిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి



నర్సంపేట రూరల్ : తనిఖీ చేస్తున్న అధికారులు



సంగెంలో..

నర్సంపేట రూరల్ : విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే విక్రయించాలని ఏడీఏ నగేశ్ స్పష్టం చేశారు. నర్సంపేటలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, విత్తన నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ నగేశ్ మాట్లాడారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో విత్తనాల కోసం రైతులు షాపుల వద్ద బారులు తీరుతుండగా ఇదే అదునుగా కొందరు డీలర్లు ఎమ్మార్పీకి మించిన ధరకు విక్రయించడానికి యత్నిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. ఎమ్మార్పీకి మించిన ధరకు రైతులకు విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠి నచర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులు విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రసీదులను పంట కాల్వ పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. డీలర్లు రైతులకు పూర్తి వివరాలు నమోదు చేసి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో నర్సంపేట ఏడీఏ సురేశ్, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్లు వేణు, విజయ్, ఏఓ కృష్ణకుమార్, ఏఈఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సంగెం : నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్.నరేశ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఎస్సై మాట్లాడారు. కాలం చెల్లిన పురుగు మందులు, విత్తనాలు విక్రయించవద్దని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎవరైనా బిల్లులు ఇవ్వకుండా లూజుగా పత్తి విత్తనాలు విక్రయిస్తే పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏడీఏ గౌస్ హైదర్, ఏఓ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

విత్తనాల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు ఏడీఏ గౌస్ హైదర్, సీఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, పురుగు మందుల డీలర్లకు గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. డీలర్లు తప్పనిసరిగా నిబంధనల మేరకు వ్యాపారం చేయాలని చెప్పారు. డీలర్లు క్రయవిక్రయాలకు సంబంధించి బిల్లులు కచ్చితంగా ఉండాలన్నారు. షాపుల్లో గడువు తీరిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల నిల్వ ఉంచవద్దని చెప్పారు. సేవా దృక్పథంతో వ్యాపారం నిర్వహించి రైతులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. సదస్సులో ఎస్సై ఎల్.నరేశ్, ఏఓ యాకయ్య, డీలర్ల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, కార్యదర్శి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలి

చెన్నారావుపేట : వేసవి సెలవులు ముగియకముందే ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, బదిలీ ప్రక్రియ చేపట్టాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. తొమ్మిదేళ్లుగా ఉద్యోగోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతోందని తెలిపారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఉమాశంకర్, కొంరయ్య, రవి, కట్టస్వామి, వీరన్న, నర్సయ్య, వెంకటేశ్వర్లు, మంజులరాణి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లను నరికిన వారిపై ఫిర్యాదు



ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట రూరల్ : దుగ్గొండి మండలంలోని పానకల్ గ్రామంలో తాటిచెట్లను చట్టవిరుద్ధంగా నరికిన వారిపై గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ గౌడ్ మాట్లాడారు. తాటి, ఈత చెట్లను అభివృద్ధి పేరుతో నరికి వేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. తాటిచెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంప రాజేశ్వర్, మద్దెల సాంబయ్య, జూలూరి హరిప్రసాద్, కందుల శ్రీనివాస్, గండిగిరి, గుండెబోయిన కోటి, తుడక కొమురయ్య, గుండెబోయిన రమేశ్, బండి జగన్నాథం, పిల్లల సురేశ్, బండి రాజయ్య, బొమ్మగాని రవీందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర చిహ్నం మార్పును స్వాగతిస్తున్నాం'



నర్సంపేట రూరల్ : రాష్ట్ర చిహ్నం మార్పును ఆహ్వానిస్తున్నట్లు ధర్మసమాజ్ పార్టీ నర్సంపేట మండల అధ్యక్షుడు సంగాల శివకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మెమోరాండం అందజేశారు. అనంతరం శివకృష్ణ మాట్లాఆరు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత చిహ్నాన్ని మార్పునున్న క్రమంలో పార్టీ ఆధ్వర్యంలో చిహ్నం రూపొందించినట్లు తెలిపారు. పార్టీ రూపొందించిన చిహ్నం రాష్ట్రంలోని 90 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఆమోదయోగ్యంగా ఉంటుందని చెప్పారు. పార్టీ రూపొందించిన చిహ్నాన్ని ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

నర్సంపేట : మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ తెలిపారు. పట్టణంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు వేసి తనను ఆశీర్వదించారంటూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో పార్టీకి ఓట్ల శాతం పెరగడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అహర్నిశలు కృషి చేసిన శ్రేణులను అభినందించారు. జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో పార్టీ అధికారంలోకి రానున్న నేపథ్యంలో నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. నర్సంపేట నియోజకవర్గంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నిస్వార్థ సేవతో ముందుకొచ్చే యువతకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్, నర్సంపేట, ఖానాపురం, మండల అధ్యక్షులు గంగిడి మహేందర్‌రెడ్డి, ఆబోతు రాజుయాదవ్, పట్టణ ఇన్‌చార్జ్ గుడిపూడి రాధాకృష్ణ, నెక్కొండ మండల ఇన్‌చార్జ్ గడ్డం ఆంజనేయులు, నాయకులు సింగారపు సురేశ్, కొంకీస విగ్నేశ్ గౌడ్, రంజిత్, అశోక్, సూత్రపు సరిత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ సామాజిక బాధ్యత



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్



నర్సంపేట రూరల్ : ముగ్దుంపురంలో..

పర్వతగిరి : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా ఎంపీడీఓ శంకర్ అభివర్ణించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో తలపెట్టిన వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని నారాయణపురంలో గురువారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 వేల సాయం అందిస్తుందని తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణాలతో నీటి వృథాను అరికట్టి భూగర్భ జలాల, నీటి మట్టం పెంపునకు బాటలు వేయొచ్చని చెప్పారు. నీటి వృథా వల్ల ఈగలు, దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ముగ్దుంపురంలో ఎంపీఓ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులతో కలిసి పాఠశాలలోని చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



చెన్నారావుపేట : తిమ్మరాయినిపహాడ్‌లో..

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్, జల్లి, తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌రాజు మాట్లాడారు. వాతావరణ సమతుల్యత కోసం ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వాతావరణాన్ని పరిరక్షించేలా జూట్ బ్యాగులు వినియోగించాలని సూచించారు.

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2000–01లో పదో తరగతి చదవుకున్న విద్యార్థులు గురువారం సమ్మేళనం నిర్వహించారు. సుమారు 24 ఏళ్ల తర్వాత మళ్లీ స్కూల్‌లో కలుసుకున్న నేపథ్యంలో ఒకరినొకరు మళ్లీ పరిచయం చేసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. నాడు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు ప్రాన్సిస్, దాన్‌సింగ్, వీరయ్య చౌదరి, సోమేశ్వర్, సంజీవ్‌కుమార్, నిరంజన్, ఆనందమోహన్, నసీరుద్దీన్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు సాయిలు, సుదర్శన్, హరీశ్, వేణుగోపాలచారి గతంలో మృతి చెందిన నేపథ్యంలో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు బండి అశోక్, కేతిడి సునీత, మధు, ముస్కు రాజు, మేడిద లక్ష్మణ్, హేమంత్, రవీందర్, రవి, బాలు, యాకన్న, ఈర్య, విజేందర్, రాజు, రఫీక్ పాషా, మహేందర్, శారద, సునీత, రమ, రజిత, లలిత పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

నర్సంపేట : 'భూమిని పంచు, బడ్జెట్ పెంచు, ఉద్యోగ అవకాశాలు కల్పించు' నినాదంతో ఈనెల 16న హైదరాబాద్‌లో తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జతారకం) రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య కోరారు. పట్టణంలో సదస్సు కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బొజ్జతారకం ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో భూపంపిణీ ప్రధాన ఎజెండాగా ఉద్యమించాల్సి ఉందన్నారు. ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్లు అంకేశ్వరపు రమేశ్, రాముల పైడి, పీసరి రజిత, హసీనా బేగం, గునిగంటి రమేశ్, కనుకుల శారద, శంకర్ తదితరులు పాల్గొన్నారు.